

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 07-07-2026 సంపుటి : 08 సంచిక 25 పేజీలు : 8 వెల : రూ 3-00


## పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి: సీఎం చంద్రబాబు



అమరావతి, జులై 6 : పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పురపాలక, పంచాయతీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. విశాఖపట్నం సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏఏ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఏపీ అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్‌మెంట్ – బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశం చేశారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారం ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని నిర్దేశించారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో స్పష్టమైన ఎస్‌ఓపీ జారీ చేయాలని ఆదేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏ మేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లోని టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## ధైర్యానికి శాశ్వత నిదర్శనం..

### శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ప్రధాని మోదీ నివాళి..





భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారుఅలాగే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రి అయిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టులకు పునాది వేశారని ప్రధాని గుర్తు చేశారు.

## మహారాష్ట్రలో భారీ వర్షాలు..

### కొండచరియలు విరిగిపడి ఇద్దరి మృతి, ఒకరి గల్లంతు..



మహారాష్ట్ర: భారీ వర్షాలు మహారాష్ట్రను కుదిపేస్తున్నాయి. ముంబై, పుణె, థానే, రాయగడ్ ప్రాంతాలు వానలకు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాలకు తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. ఒకరు గల్లంతయ్యారు. ఎడతెరిపి లేని వానలతో పుణె జిల్లా మావల్ తహసీల్‌లోని పటాన్‌లో ఈరోజు తెల్లవారుజామున 4:25 గంటలకు పలు ఇళ్లపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు 30 నుంచి 35 మంది గ్రామస్థులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించగా, మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. బాధితులను నందు టికోన్ (60), మౌలి టికోన్ (30), అనితా టికోన్ (55)గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో వర్షాల కారణంగా ఇప్పటివరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా.. వారిలో ఒక్క ముంబైలోనే 8 మంది వివిధ ఘటనల్లో మృతిచెందారు. మరోవైపు, ఈ ఘటనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. కొండచరియలు విరిగిపడ్డాయని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. ఈ ఘటనతో ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే, పాత ముంబై-పుణె హైవేపై భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని ఆయన వెల్లడించారు. సుమారు 100 టన్నుల శిథిలాలు ఒక్కసారిగా ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వేపై పడ్డాయని పేర్కొన్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని.. ఇప్పటివరకు దాదాపు 70 శాతం శిథిలాలను తొలగించినట్లు సీఎం వివరించారు. పుణె నుంచి ముంబైకి వెళ్లే ట్రాఫిక్ కోసం ఒక లేన్‌ను తిరిగి తెరిచామని, రాబోయే కొన్ని గంటల్లో ఎక్స్‌ప్రెస్‌వే పూర్తిస్థాయిలో పనిచేస్తుందని ఆయన వెల్లడించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ముంబై-పుణె రహదారిపై ప్రమాదాలు పొంచి ఉన్నాయని అధికారులు తెలిపారు. అత్యవసర ప్రయాణాలు మినహా సాధారణ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ప్రజలకు సూచించారు. కాగా, మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ముంబై, థానే, రాయగడ్ జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికల ప్రకారం రానున్న గంటల్లో ముంబై సహా పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. సుమారు 15 వేల మంది సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు.

## గ్రామాల్లో విలేజ్ మార్ట్‌లకు ఏపీ ప్రభుత్వం శ్రీకారం

గుంటూరు జిల్లా, జులై 6 : గ్రామాల్లో విలేజ్ మార్ట్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ షాపుల ద్వారా తక్కువ ధరకే నిత్యావసరాల అమ్మకాలు జరగనున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం లాల్‌పురంలో పైలట్ ప్రాజెక్ట్‌ను ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మీడియాతో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఈ రోజు 7 విలేజ్ మార్ట్‌లు ప్రారంభించామని తెలిపారు.ఎజగన్ హయాంలో రాష్ట్రంలోని 29,750 రేషన్ షాపులను పూర్తిగా నిర్వీర్యం చేశారని మంత్రి నాదెండ్ల మండిపడ్డారు. గ్రామీణ రేషన్ వ్యవస్థలో కార్పొరేట్ తరహా సంస్కరణలు తీసుకువస్తున్నామని వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా రేషన్ షాపులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 1,000 మినీ మార్ట్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పుకొచ్చారు.






## ఏపీ అభివృద్ధికి అడ్డుపడితే ప్రజలు సహించరు..

### జగన్ అండ్ కోపై మంత్రి నారాయణ ధ్వజం



నెల్లూరు, జులై 6 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు అడ్డుపడితే ప్రజలు సహించరని.. మంచిని చెడుగా చూపిస్తే, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈరోజు(సోమవారం) నెల్లూరులో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మల్లెల సంజీవయ్య హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో మూసేసిన వీఆర్సీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పున: ప్రారంభించామని మంత్రి తెలిపారు. వీఆర్సీని తలదన్నేలా మరో 15 హైస్కూల్స్‌ను ఆధునికీకరిస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని స్కూల్స్ సిద్ధం చేస్తామని వెల్లడించారు.

## గల్లంతైన మత్స్యకారుల గాలింపు చర్యలపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష

అమరావతి, జులై 6: అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం మండలం రేవు పోలవరం సముద్ర తీరంలో పడవ బోల్తా ఘటనలో మత్స్యకారుల గల్లంతుపై మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. గల్లంతైన మత్స్యకారుల గాలింపు చర్యలపై నేవీ, కోస్ట్ గార్డు అధికారులతో ఉదయం సమావేశమై



చర్చించారు. గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి వచ్చేలా అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రెండో రోజూ ప్రత్యేక నౌక, రెస్క్యూ బోటు, హెలికాప్టర్‌తో నేవీ, కోస్ట్ గార్డు సంయుక్త గాలింపు కొనసాగుతోందని మంత్రికి అధికారులు తెలిపారు. కారి చిన్న ఇచ్చిన సమాచారం ఆధారంగా మిగిలిన ఆరుగురు మత్స్యకారుల కోసం గాలింపు కొనసాగిస్తున్నామన్నారు. మరోవైపు, కారి చిన్నను ఈరోజు విశాఖ ఫిషింగ్ హార్బర్‌కు కోస్ట్ గార్డు తీసుకెళ్లనుంది.

గల్లంతైన వారిలో కారి గంగయ్య, అమర అప్పలరాజు, కారి సితోడు, మేడ చిన్న అమ్మోరు, కారి చిన్నయ్య, రాగుతు బండియ్యలు ఉన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 07-07-2026

## ముప్పేట దాడిలో పాకిస్తాన్

పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో దశాబ్దాలుగా కొనసాగుతున్న స్వాతంత్ర్య ఉద్యమం ఇప్పుడు కొత్త రూపం తీసుకుంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) పాకిస్తాన్ భద్రతా దళాలను మాత్రమే కాకుండా, చైనా ప్రయోజనాలను కూడా నేరుగా లక్ష్యంగా చేసుకుంటోంది. ఇటీవలి దాడులు ఈ మార్పును స్పష్టంగా చూపిస్తున్నాయి. చైనా?పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సీపీఈసీ) ప్రాజెక్టుల భద్రతపై ఇది తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. గ్వాదర్ పోర్టు సమీపంలోని జివానీ ప్రాంతంలో జరిగిన ఇటీవలి ఘటనలో బీఎల్‌ఏ పాకిస్తాన్ సైన్యానికి చెందిన రాడార్ స్టేషన్, ఎయిర్ స్టేషన్ ఔట్‌పోస్టుపై దాడి చేసింది. ఈ ప్రాంతానికి సమీపంలో చైనాకు సంబంధించిన స్థావరం ఉండటం వల్ల ఈ దాడి చైనాపై కూడా ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. గ్వాదర్ పోర్టుకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో జరిగిన ఈ దాడి, హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఉండటం వల్ల వ్యూహాత్మక ప్రాధాన్యతను సంతరించుకుంది. బీఎల్‌ఏ మందుగుండు వాహనంతో ఆత్మాహుతి దాడి చేసినట్లు సమాచారం. దీంతో పాకిస్తాన్ భద్రతా దళాల్లో భారీ ప్రాణనష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఇంతకు ముందు బీఎల్‌ఏ నాలుగైదు ప్రధాన వంతెనలను పేల్చివేసి, ఇప్పుడు తీర భద్రతా దళాలపై కూడా దాడులు చేస్తోంది. బీఎల్‌ఏ తన స్వంత నేవీ ఫోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు ప్రకటనలు వచ్చాయి. గతంలో కోస్ట్ గార్డ్ సిబ్బందిపై దాడులు జరిపి, ముగ్గురిని చంపినట్లు బీఎల్‌ఏ పేర్కొంది. చైనా ఇప్పటికే పాకిస్తాన్ భద్రతా ఏర్పాట్లపై నమ్మకం కోల్పోయి, తన స్వంత రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంది. అయినప్పటికీ, ఇలాంటి ఘటనలు చైనా పెట్టుబడుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. చైనా?పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో కీలక భాగం. గ్వాదర్ పోర్టు ద్వారా చైనాకు అరేబియన్ సముద్రంలో ప్రత్యక్ష ప్రవేశం లభిస్తుంది. ఈ ప్రాంతంలో దాడులు పెరగడం వల్ల ప్రాజెక్టుల అమలు ఆలస్యం కావడం, ఖర్చులు పెరగడం, పెట్టుబడిదారుల నమ్మకం తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. బీఎల్‌ఏ దాడులు ఇప్పుడు చైనా నియంత్రణలో ఉన్నట్లు భావించే ప్రాంతాల్లోకి విస్తరించాయి. ఇది చైనా ప్రణాళికలను భంగపరచడమే కాకుండా, పాకిస్తాన్‌తో చైనా సంబంధాలను కూడా పరీక్షిస్తోంది. చైనా ఇప్పటికే ఉలిక్కిపడి, భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేసుకుంటోంది. బీఎల్‌ఏ దాడులు ఇప్పుడు మరింత సంఘటితంగా, వ్యూహాత్మకంగా మారాయి. గ్వాదర్ పోర్టును తదుపరి టార్గెట్‌గా ఎంచుకోవచ్చని చర్చలు జరుగుతున్నాయి. బీఎల్‌ఏ తన దాడుల వీడియోలు, సాక్ష్యాలతో సహా విడుదల చేస్తోంది. దీని వల్ల ప్రచారం విస్తృతంగా వ్యాపిస్తోంది. అయితే పాకిస్తాన్ అధికారులు ఈ ఘటనల గురించి బహిరంగంగా మాట్లాడడం లేదు. పత్రికల్లో కూడా విస్తృతంగా కవరేజ్ రావడం లేదు. ఇది ప్రభుత్వం దాడుల పరిమాణాన్ని తక్కువ చేయడానికి లేదా చైనా పెట్టుబడులపై నమ్మకం కల్పించడానికి చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోంది. అయినప్పటికీ, బీఎల్‌ఏ ప్రచారం వల్ల వాస్తవాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తున్నాయి. ఈ దాడుల నేపథ్యంలో అమెరికా బలూచ్ ఉద్యమానికి మద్దతు ఇస్తోందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇది చైనా ప్రభావాన్ని అడ్డుకోవడానికి భాగంగా ఉండవచ్చని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇవి ఇప్పటికి అనుమానాలే. చైనా బలూచిస్తాన్ నుంచి వెళ్లిపోవాలనే ఉద్దేశంతో బీఎల్‌ఏ ఈ దాడులు చేస్తోందని కూడా భావన ఉంది. గ్వాదర్ పోర్టు, సమీప ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు కొనసాగితే, చైనా తన ప్రాజెక్టులను పునఃసమీక్షించవచ్చు లేదా భద్రతా ఖర్చులను బాగా పెంచవచ్చు. బలూచిస్తాన్ సమస్య ఇప్పుడు స్థానిక స్థాయిని దాటి ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలను కలిగిస్తోంది. చైనా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు బలంగా ఉన్నప్పటికీ, భద్రతా సవాళు రెండు దేశాలను కూడా ఒత్తిడిలోకి తెస్తున్నాయి. జైష్ ఎ మహ్మద్‌కు కేటాయించిన భూమి సుమారు 5 ఎకరాలు. ఒక ఎకరం సుమారు 4,800 గజాలకు సమానం కాబట్టి మొత్తం స్థలం 24,000 గజాలు అవుతుంది. సాధారణంగా ఒక వ్యక్తిని సమాధి చేయడానికి 6 గజాలు సరిపోతాయని పరిగణిస్తే, ఈ భూమిలో సుమారు 4 వేల మంది వరకు సమాధి చేయవచ్చు. ఇంత పెద్ద ప్రాంతాన్ని కేటాయించడం సాధారణం కాదు. ఇది భవిష్యత్తులో ఎక్కువ సంఖ్యలో మరణాలను ఊహించి లేదా ఇప్పటికే జరిగిన పెద్ద నష్టాలను సూచిస్తోంది. ఈ సమాధి స్థలాలు ఆపరేషన్ సిందూర్ అనే సైనిక చర్యతో నేరుగా ముడిపడి ఉన్నాయి. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం లష్కర్ ఎ తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్, జైష్ ఎ మహ్మద్‌తోపాటు మరో రెండు ఉగ్రవాద సంస్థలకు చెందిన మొత్తం 11 స్థావరాలపై దాడి చేసింది. బ్రహ్మోస్ క్షిపణులు ఉపయోగించి ఈ దాడులు నిర్వహించారు. నివేదికల ప్రకారం వందల మంది ఉగ్రవాదులు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఉమర్ అనే ఒక్క వ్యక్తి మాత్రమే బతికి ఉన్నట్లు సమాచారం. ఈ వైరల్ ఫొటోలు, స్థల కేటాయింపులను పరిశీలిస్తే ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాద సంస్థలపై ఎంత బలమైన దెబ్బ తగిలించిందో అర్థమవుతుంది. ఒక్క జైష్ ఎ మహ్మద్‌కే 5 ఎకరాలు కేటాయించడం, మిగతా సంస్థలకు ప్రత్యేక స్థలాలు ఇవ్వడం. ఇవి అన్నీ ఒకేసారి జరిగిన పెద్ద మరణాలను సూచిస్తున్నాయి. 4 వేల మంది వరకు సమాధి చేయగల స్థలం కేటాయించడం అంటే ఆ సంస్థలు తమ సభ్యులను కోల్పోయిన స్థాయి చాలా ఎక్కువగా ఉందని చెప్పవచ్చు.

# ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డంప్ యార్డా?



రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో డంప్ యార్డు ఏర్పాటు నిర్ణయంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న స్థానిక రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. డంప్ యార్డు వల్ల తాము ఏ విధంగా నష్టపోతున్నామో వివరిస్తూ ఆయన ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయానికి వ్యతిరేకంగా తమ పక్షాన పోరాడాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. రైతుల వినతిపై స్పందించిన మాజీ మంత్రి హరీశ్ రావు గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నం. 641 తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన చర్య. పచ్చని వ్యవసాయ భూముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ

**సిద్దాపూర్ డంప్ యార్డు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి..**

**లేనిపక్షంలో బాధిత రైతుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమిస్తుంది.**

**-మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరిక**

అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనం. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. సిద్దాపూర్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాలు ఈ డంప్ యార్డు వల్ల తీవ్రంగా నష్టపోతాయి. ఈ గ్రామాల ప్రజలంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి అవసరమైన కూరగాయలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి ఆనుకుని ఉన్న 'గుట్ట చెరువు' నీటితోనే ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇప్పుడు ఆ చెరువు పక్కనే డంప్ యార్డు పెడితే ఆ నీరు పూర్తిగా కలుషితమై, సాగు నీటితో పాటు తాగునీటికీ తీవ్ర ముప్పు వాటిల్లుతుంది. అంతేకాకుండా ఎంతో ప్రసిద్ధి చెందిన జహంగీర్ పీర్ దర్గా కూడా ఇక్కడే ఉండటంతో, ఆ కాలుష్యం స్థానికులతో పాటు భక్తులకు కూడా శాపంగా మారడం ఖాయం. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో, డంప్ యార్డుకు కేటాయించిన సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మించాలని మేము ప్రణాళికలు రూపొందించాం. ఇక్కడ ఐటీ పార్క్ వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని బీఆర్ఎస్ సంకల్పించింది. కానీ, ఉపాధి కల్పించాల్సిన భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం డంప్ యార్డు ఏర్పాటు చేసి స్థానికప్రజలబతుకులను చిదిమేయాలని చూడటం శోచనీయం. యువతకు అవకాశాలుకల్పించాల్సిన చోట కాలుష్యాన్ని, రోగాలను ఇవ్వడమే ప్రజాపాలనా?ప్రభుత్వం డంప్ యార్డులను ఏర్పాటు చేయాలనుకుంటే ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలగని చోట, జనావాసాలు, గ్రామాలు లేని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. కానీ ఇలా పచ్చని పల్లెలను, పొలాలను, రైతులను ఆగమాగం చేయడం ఏమాత్రం తగదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిద్దాపూర్ డంప్ యార్డు నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో నష్టపోతున్న ఆ 20 గ్రామాల ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని, స్థానిక రైతులకు అండగా నిలబడి పోరాడుతుందని హెచ్చరిస్తున్నాం.

## జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్

**భక్తుల కోసం మూడు రోజుల పాటు శ్రీ హనుమాన్ కథ**

**హైదరాబాద్‌లో తొలిసారి బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి కార్యక్రమం**

**బ్రోచర్ ఆవిష్కరించిన హైదరాబాద్ బాగేశ్వర్ ధామ్ సేవా సమితి సభ్యులు**

హైదరాబాద్ : జూలై 17, 18, 19 తేదీల్లో బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి దివ్య దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భక్తుల కోసం మూడు రోజుల పాటు శ్రీ హనుమాన్ కథ ఉంటుంది. హైదరాబాద్‌లో తొలిసారి బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి కార్యక్రమం నిర్వహించనున్నారు. బాగేశ్వర్ సర్కార్ శ్రీ ధీరేంద్ర కృష్ణ శాస్త్రి తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న మూడు రోజుల కార్యక్రమాల కోసం సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నిర్వాహకులు అంజనీ కుమార్ అగర్వాల్, సూర్య కమల్ గుప్తా, సంజయ్ అగర్వాల్, రాకేష్ జలాన్, రాకేష్ నర్సింగ్‌పురియా, సందీప్ మిత్తల్, ఘనశ్యామ్ అగర్వాల్, నవీన్ అగర్వాల్, పవన్ తిబ్రేవాల్, అంకిత్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, రూపేష్ అగర్వాల్, శుభమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు జూలై 17, 18, 19 తేదీలలో గగన్ పహాడ్‌లోని పురాన్ సన్స్ ఫార్మ్స్ (ప్రెస్టీజ్ సిటీ గేట్ ఎదురుగా) జరగనున్నాయి. ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని హైదరాబాద్ బాగేశ్వర్ ధామ్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛంద సేవకుల సమావేశంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పాటించాల్సిన నియమాలు, సేవా విధానాలు, బాధ్యతల గురించి వారికి విపులంగా వివరించారు. పురాన్ సన్స్ ఫార్మ్స్‌లో పండిత్ సంజయ్ శర్మ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం జరిగిన స్వచ్ఛంద సేవకుల సమావేశంలో కన్వీనర్ అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇంతటి భారీ స్థాయిలో ఈ తరహా ఆధ్యాత్మిక కార్యక్రమం తొలిసారిగా నిర్వహించబడుతోందన్నారు. అందరూ సమష్టిగా కృషి చేసి ఈ కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆయన పిలుపునిచ్చారు. బాగేశ్వర్ ధామ్ నుంచి 60 మంది సభ్యుల బృందం, అలాగే ఇతర ప్రాంతాల నుంచి 500 మంది రానున్నారని, వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. జూలై 16 నుంచి 19 వరకు స్వచ్ఛంద సేవకులు విధుల్లో ఉండాలని సూచించారు. సేవలందించిన ప్రతి స్వచ్ఛంద సేవకునికి 'బాబా' తరపున ప్రత్యేక ప్రశంసాపత్రం (సర్టిఫికేట్) అందిస్తామన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపాలి

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం అమీర్ పేట లోని ధరంకరం రోడ్డులో గల మున్సిపల్ గ్రౌండ్ లో తన సోదరుడు తలసాని శంకర్ యాదవ్ 2 వ స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ముందుగా శంకర్ యాదవ్ చిత్రపటం వద్ద పూలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బ్యాట్ పట్టి క్రికెట్ ఆడి విద్యార్థులను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం చదువు పై శ్రద్ధ చూపడమే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల కోసం కొంత సమయం కేటాయించాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించే విధంగా తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ప్రకటించారు. పోటీలలో పాల్గొంటున్న టీమ్ లకు సంబంధించిన వివరాలు అందిస్తే క్రికెట్ కిట్ లను అందజేస్తామని చెప్పారు. మూడు రోజుల పాటు జరిగే క్రికెట్ టోర్నమెంట్ లో సుమారు 100 టీమ్ లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, సురేష్ గౌడ్, రమేష్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం, రాజేష్ ముదిరాజ్, బాబా, ప్రకాష్ గౌడ్, ప్రదీప్ గౌడ్, ఉత్తమ్ సింగ్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.



## 'గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత'

**మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**

కట్టంగూర్, జూలై 6 : గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బొడ్రాయి పండుగలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం కట్టంగూర్ మండలంలోని ముత్యాలమ్మగూడెం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగ కార్యక్రమానికి హాజరైన ఆయన గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ దేవత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేతో పాటు ప్రజా ప్రతినిధులను, నాయకులను కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ్మా, అయిటి పాముల సర్పంచ్ బెల్లి సుధాకర్, పామనగుండ్ల సర్పంచ్ వడ్డే మాధవి సైదిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పనస సైదులు, నల్లమాద సైదులు, వడ్డె సైదిరెడ్డి, పెద్ది బాల నర్సయ్య, గుండగోని రాములు, మల్లెబోయిన శీను, బీరెల్లి ప్రసాద్, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సర్ఫస్ కన్వర్షన్‌లో పీవీకే-5 భూగర్భ గని కార్మికులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి : ఏఐటీయూసీ

రుద్రంపూర్, జూలై 06 : కొత్తగూడెం ఏరియాలో భూగర్భ గనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులతోనే సర్ఫస్ కన్వర్షన్ చేపట్టి, ఏరియాలో ఖాళీగా ఉన్న సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ పోస్టులను భర్తీ చేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యంపై నిరంతరం ఒత్తిడి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ మాట్లాడుతూ.. ఈ సమస్యను ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి భూగర్భ గని కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఏఐటీయూసీ ఒత్తిడి ఫలితంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించాల్సిన సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ వెబ్ కౌన్సిలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు యాజమాన్యం గుర్తింపు సంఘం ఏఐటీయూసీకి తెలిపిందన్నారు. అండర్ గ్రౌండ్ కార్మికుల సర్ఫస్ కన్వర్షన్ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, మణుగూరు సర్ఫస్ జనరల్ అసిస్టెంట్స్ తో సంబంధం లేకుండా ముఖ్యంగా పీవీకే-5 భూగర్భ గనిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన కార్మికులకే తొలి ప్రాధాన్యత కల్పించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. అదేవిధంగా సర్ఫస్ కన్వర్షన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి.మల్లికార్జున్ రావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి గట్టయ్య, ఆఫీస్ బేరర్ హుమాయూన్, నాయకులు లక్ష్మీనారాయణ, సోమయ్య పాల్గొన్నారు.



## ముంబైలో కొనసాగుతున్న భారీ వర్షాలు..

**రెడ్ అలర్ట్ జారీ చేసిన ఐఎండీ..**

ముంబై మహానగరాన్ని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఈ వర్షాల కారణంగా ముంబై నగరం స్తంభించిపోయింది. పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. డబ్బావాలాల సేవలు నిలిచిపోయాయి. ముంబై యూనివర్సిటీ పరిధిలో జరగాల్సిన అన్ని పరీక్షలు వాయిదా పడ్డాయి. ముంబై రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. రైల్వే స్టేషన్లు కూడా జలమయమయ్యాయి. మరోవైపు భారీ వర్షాలతో విమాన సేవలకు అంతరాయం ఏర్పడింది మహారాష్ట్రలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ముంబై, థానే, రాయగడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అత్యంత భారీ వర్షాలు, గంటకు 80?90 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విరార్-వసాయి ప్రాంతంలో డబ్బావాలాల ఇళ్లు నీట మునిగాయి. అలాగే పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇక, ముంబై మాంఖుర్డ్ ప్రాంతంలో ఇళ్లు కూలి ఆరుగురు మృతి చెందారు. మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర సీఎం రూ.5 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు ఐఎండీ హెచ్చరికల ప్రకారం రానున్న గంటల్లో కూడా ముంబైలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది పరిస్థితిని ఎదుర్కొనేందుకు విపత్తు నిర్వహణ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తం చేసింది. సుమారు 15 వేల మంది సిబ్బంది సహాయక చర్యల కోసం సిద్ధమవుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో వరదలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి పరిస్థితులు తలెత్తే ప్రమాదముందని ప్రభుత్వం హెచ్చరించింది.



## నిత్యాన్నదానానికి కోల్డ్ స్టోరేజ్ విరాళం--

రూ.2 లక్షల అడ్వాన్స్ అందజేత--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 06-కడపకు చెందిన గురిజాల బాల నాగిరెడ్డి, శ్రీమతి సావిత్రి దంపతులు ఆలయ నిత్యాన్నదాన పథకానికి విశేష సేవ అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు నిత్యాన్నదాన పథకంలో వినియోగించే కూరగాయల నిల్వ కోసం సుమారు రూ. 4.50 లక్షల విలువైన కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా తమ కుమార్తెలు, అల్లుళ్లు ఎల్. విజయభాస్కరరెడ్డి (ఆదాయపు పన్ను కమిషనర్), జయశిల్ప దంపతులు, కే. నారాయణరెడ్డి (తెలంగాణ ఎస్పీ), హరితలతో కలిసి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు తొలి విడతగా రూ. 2 లక్షల అడ్వాన్స్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డికు భక్తిశ్రద్ధలతో అందజేశారు. భక్తుల సహకారంతో నిత్యాన్నదాన పథకాన్ని మరింత బలోపేతం చేయాలనే సంకల్పానికి ఈ విరాళం దోహదపడుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

## ఓటర్ల సర్వేపై క్షేత్రస్థాయి తనిఖీ--

పలు వార్డుల్లో ఇంటింటి పరిశీలన నిర్వహించిన కమిషనర్ బి. శేషన్న, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 6:ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, తప్పులులేకుండా పూర్తి చేయాలనే లక్ష్యంతో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 13వ వార్డు, 16వ వార్డులోని ఎస్‌బీఐ కాలనీ, 18వ వార్డులోని ఎన్జీవోస్ కాలనీల్లో ఎస్ఐఆర్ పీఎస్ నంబర్లు 150 నుంచి 153 వరకు, అలాగే 164, 165, 167 పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల నమోదు, ఫారాల స్వీకరణ, నమోదైన వివరాల ఖచ్చితత్వాన్ని పరిశీలించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు తప్పనిసరిగా జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, అర్హులెవరూ మిగిలిపోకుండా ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ఓటర్ల వివరాల్లో ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ ప్రజావేదికకు 127 ఫిర్యాదులు--

అడిషనల్ ఎస్పీ ఖాదర్ భాషా ---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 6:నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 127 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ భాషా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను విన్న ఆయన, ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోనే పరిష్కారం చూపాలని సూచించారు.




## ఓటరు వివరాలు తప్పనిసరిగా సరిచూసుకోండి--

ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 06:ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి ఓటరు తమ వ్యక్తిగత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్ధారించుకోవాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం నంద్యాల పట్టణంలో కొనసాగుతున్న ఓటరు సర్వే, ఎన్యూమరేషన్ ప్రక్రియను కమిషనర్ బి. శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోల పనితీరు, ఇంటింటి సర్వే పురోగతి, ఓటర్ల నుంచి సేకరిస్తున్న వివరాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు సమర్పించే ఎన్యూమరేషన్ పత్రాల్లో పేరు, తల్లిదండ్రుల పేరు, చిరునామా, జన్మతేదీ తదితర వివరాలు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డులో నమోదైన వివరాలతో సరిపోలేలా జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో సందేహాలు ఉన్నా లేదా బీఎల్‌వోలు ఇంటికి రాకపోయినా ఎన్నికల సంఘం టోల్‌ఫ్రీ నంబర్ 1950కు కాల్ చేసి పూర్తి సమాచారం పొందవచ్చని చెప్పారు. అదేవిధంగా, ఆన్‌లైన్‌లో ఓటరు వివరాలను నమోదు చేయాలనుకునే వారు ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లో మొబైల్ నంబర్, ఓటరు గుర్తింపు కార్డు (ఈపిక్) వివరాలతో లాగిన్ అయి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని వివరించారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రతి ఓటరు అప్రమత్తంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న పిలుపునిచ్చారు. కమిషనర్ వెంట మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ విక్రమ్. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అర్జీలకు నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలి--

పీజీఆర్ఎస్‌లో 325, రెవెన్యూ క్లినిక్‌లో 177 దరఖాస్తులు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 6:ప్రజా పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి అర్జీని కాలపరిమితిలో నాణ్యతతో పరిష్కరించి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్ అధికారులను ఆదేశించారు.



సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్జీలను కేవలం ముగించడం కోసం కాకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, రీఓపెన్ అవుతున్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వారంలో పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 325 అర్జీలు, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 177 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో భూ వివాదాలు, ఆర్ఓఆర్, అసైన్డ్ భూములు, సర్వే, రీ-సర్వే, అడంగల్ సవరణలు, 22-ఎ భూములు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణానికి చెందిన సి. లక్ష్మి గృహం మంజూరు చేయాలని, డోన్ మండలం కామగనికుంట్ల గ్రామానికి చెందిన మద్దయ్య భూమి ఆన్‌లైన్ నమోదు చేయాలని, మిడ్తూరు మండలం మాసాపేటకు చెందిన అక్బర్ బాషా రీసర్వేలో తగ్గిన భూమిని నమోదు చేయాలని వినతులు సమర్పించారు. సమావేశంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు చేయాలి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 6:రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, పూర్తి సన్నద్ధతతో పనిచేసి ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా సవరించాలని సూచించారు. స్టాళ్ల ఏర్పాటు, ఫ్లెక్సీలు, బ్రీఫింగ్ నోట్స్‌ను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి, తాగునీరు, గృహనిర్మాణం, పర్యాటకం తదితర అంశాలకు



సంబంధించిన గణాంకాలను ఖచ్చితంగా సమర్పించాలని పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారి తమ బాధ్యతలను సమయపాలనతో నిర్వర్తించి సీఎం పర్యటన విజయవంతానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 6:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బనగానపల్లె పర్యటన నేపథ్యంలో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, సోమవారం పరిశీలించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్, వీఐపీ రాకపోకల మార్గాలు, ప్రజల ప్రవేశ?నిష్క్రమణ ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## నంద్యాల ఏఎస్పీ మందా జావళికి బదిలీ--

జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మితకు నంద్యాల బాధ్యతలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 6:రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా నంద్యాల జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ (ఏఎస్పీ) మందా జావళి ఆల్ఫోన్స్కు బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను పోలవరం ఓఎస్డీ (అడ్మిన్)గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. సాయిప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మందా జావళి ఆల్ఫోన్స్ స్థానంలో జంగారెడ్డిగూడెంలో ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి సుస్మితను నంద్యాల జిల్లా ఏఎస్పీగా నియమిస్తూ



ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఆరుగురు ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం, పోలీసు శాఖలో పరిపాలనా మార్పులకు శ్రీకారం చుట్టింది. త్వరలోనే నూతన ఏఎస్పీ సుస్మిత నంద్యాలలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ బదిలీలతో జిల్లాలో పోలీసు పరిపాలన మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## జూనోసిస్ వ్యాధులపై అవగాహనే రక్షణ--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , జూలై 6:ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంద్యాలలో జంతు ప్రేమికులు ప్రజల్లో జూనోసిస్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మనుషులు?జంతువుల మధ్య సంక్రమించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పెంపుడు జంతువులకు తప్పనిసరిగా సమయానికి టీకాలు వేయించాలని సూచించారు. జంతువుల ఆరోగ్యం, పశుసంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతోనే జూనోసిస్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని వివరించారు. “ఒకే ఆరోగ్యం (వన్ హెల్త్)” భావనను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, జంతువులను ప్రేమించడంతో పాటు వాటి ఆరోగ్య పరిరక్షణ కూడా సమాజ భద్రతకు ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ బ్యానర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో పసువర్దన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారెడ్డి. సేవ్ ద డాగ్స్ ఫర్ నంద్యాల బృంద సభ్యులు లావణ్య, చైతన్య, అరవింద్, సునీత, లక్ష్మి పాల్గొని జూనోసిస్ వ్యాధుల నివారణకు ప్రజలు సహకరించాలని కోరారు.

## టెట్ ఉర్దూ స్టడీ మెటీరియల్ పంపిణీ--

విద్యార్థులకు ఉచితంగా అందజేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూలై 6:మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నంద్యాలలోని రాజారెడ్డి ఫంక్షన్ హాల్‌లో టెట్-2026 ఉర్దూ మీడియం స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ, ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉర్దూ మీడియం విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టెట్‌తో పాటు ఇతర పోటీ పరీక్షల్లో మంచి



ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్ఎండి ఫిరోజ్, రామచంద్రరావు, అంజద్ భాషా, సబిహా పర్వీన్, మునియార్ ఖలీల్, దస్తగిరి, రఫీ అహ్మద్, అస్మద్దీన్, మిద్దె ఉసేని, ఆరిఫా భాను, అబ్దుల్లా అజీజ్, పిట్టల హనీఫ్, గోవింద నాయుడు, జిల్లెల్ల శ్రీరాములు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**